క్లుప్తంగా

చెక్కులు అందజేత

టేకులపల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంగారం గ్రామానికి చెందిన కె.రేణుక రూ.45 వేలు, మూడుతండాకు చెందిన ఎం.వెంకటేశ్వర్లు రూ.39,500, టేకులపల్లికి చెందిన టి.స్వరాజ్యం రూ.16వేలు, కృష్ణాపురంకు చెందిన వి.సమ్మయ్య రూ.38వేల చెక్కులు అందజేశారు.

జూలూరుపాడు: రాజారావుపేట గ్రామానికి చెందిన ముళ్లపాటి పద్మావతికి రూ.58 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ తన కార్యాలయంలో అందజేశారు.

కేజీబీవీలో వైద్య పరీక్షలు

టేకులపల్లి: విద్యార్థులకు అల్పాహారం, భోజనం తయారు చేసే వంటశాల నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, బాలికల్లో వచ్చే రక్తహీనత, అంటువ్యాధులు తదితర వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వంట చేసేవారు, వర్కర్లు కూడా పరిశుభ్రత పాటించాలని సూచించారు.

మహిళా కేంద్రాలతో ప్రయోజనం

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని జిల్లా మహిళా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా అన్నారు. మంగళవారం ఆమె పెనగడప పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాన్ని సందర్శించారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళల ఆరోగ్య సమస్యలకు ఈ కేంద్రాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి పట్నాల వేడుక



ఆలయంలో చైర్మన్ డీవీ, కౌన్సిలర్లు అనిత, పద్మ

ఇల్లెందు: పట్టణంలోని 12వ వార్డు కొత్త కాలనీలో ఎల్లమ్మ తల్లి పట్నాల వేడుక మంగళవారం ఘనంగా జరిగింది. జై గణేష్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా మున్సిపల్ చైర్మన్ డీవీ, కౌన్సిలర్లు అనిత, పద్మ, సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్యపాత్ర పోషించిన ఉద్యమకారులను ఆదుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఉద్యమకారుల నిరసనకు భిక్షాటన చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటులో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులను కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఉద్యమకారులను ఆదుకోవాలని, ఉపాధి చూపాలని, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని ప్రతి సంక్షేమ కోటాలో ఉద్యమకారులకు ప్రత్యేక కోటాను కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

టేకులపల్లి: ఉపాధి హామీ కూలీలు డిజిటల్ ఆర్థిక లావాదేవీలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ శాఖ (ఐపీపీబీ) అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, ఈజీఎస్ ఏపీఓ కాళంగి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం తడికలపూడి పంచాయతీ కోక్యాతండాలో ఆర్థిక అక్షరాస్యత, కొత్త ఖాతాల ఓపెనింగ్ కార్యక్రమం జరిగింది. నగదు రహిత సేవలు, లావాదేవీలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. కూలీలకు వేతనాల చెల్లింపులకు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాలను తెరిపించారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

పాల్వంచ: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏడు యూనిట్లకు గాను 340 మంది దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సమక్షంలో ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, ఏపీజీవీబీ బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఇంటర్వ్యూలకు హాజరైన వారిలో ఏడుగురిని ఎంపిక చేసి బ్యాంక్ అధికారులు రుణాలు అందించడం జరుగుతుందని చెప్పారు.

తక్కువ ఖర్చుతో ఆటకు రెడీ!

- ఇల్లెందు మున్సిపాల్టీలో 13 ఆటస్థలాలు
- కొద్దిపాటి నిధులతోనే ఏర్పాట్లు
- విద్యార్థులు, యువతకు ప్రయోజనం



14వ వార్డులో అందుబాటులోకి వచ్చిన క్రీడాప్రాంగణం

ఇల్లెందు: మున్సిపాల్టీ పరిధిలోని ప్రతి వార్డులో ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోంది. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా క్రీడలను ప్రోత్సహించేలా వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. విద్యార్థులు, యువకుల్లో శరీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కల్పించేలా, విద్యార్థులు శక్తివంతులుగా ఎదిగేందుకు తోడ్పాటు అందించనున్నాయి. మున్సిపాల్టీల్లో వార్డుకు ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు సుమారు 3 లక్షల వరకు ఖర్చు చేయాలని నిర్ణయించింది. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్‌తో పాటు వ్యాయామం కోసం సింగిల్, డబుల్ బార్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇల్లెందు మున్సిపాల్టీలో గత ఏడాది మూడు పూర్తి చేశారు. ఈ ఏడాది 10 పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికే 2, 3, 12, 13, 14, 16, 19వ వార్డులో క్రీడా ప్రాంగణాలు చేపడుతున్నారు. ఇక 1, 7, 14వ వార్డులో పూర్తి చేశారు.

రూ.50వేల లోపు నిధులతో...

ప్రభుత్వం ఒక్కో క్రీడా ప్రాంగణంకు లక్షల నిధులు కేటాయిస్తోంది. అయితే అతి తక్కువ ఖర్చుతో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇల్లెందులో చేపట్టిన ఈ క్రీడా ప్రాంగణాలు అర ఎకరం స్థలంలో రూ. 50 వేల లోపు ఖర్చుతో పూర్తి చేస్తున్నారు. స్థానికంగా మున్సిపాల్టీలో లభించిన మెటీరియల్‌తో ప్రాంగణాలు తయారు చేసి అప్పగిస్తున్నారు. ఇక అన్నీ క్రీడాప్రాంగణాలు కూడా పాఠశాలల్లో అంతర్భాగంగా ఉండేలా విద్యార్థులకు ఉపయోగపడేలా చేపడుతున్నారు. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా విద్యార్థులకు ఉపయోగపడేలా ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులో ఉన్న సామగ్రితో..



మున్సిపాల్టీలో చేపట్టిన క్రీడా ప్రాంగణాలను అతి తక్కువ ఖర్చుతో పూర్తి చేయాలని నిర్ణయించాము. అందుబాటులో ఉన్న మెటీరియల్‌తో ఏర్పాటు చేస్తున్నారు. ఖోఖో, వాలీబాల్ గ్రౌండ్‌ల తయారు కోసం అవసరమైన పోల్స్‌ను స్థానికంగా లభించే ఐరన్ స్తంభాలతో ఏర్పాటు చేస్తున్నాము.

– అంకుషావలి, కమిషనర్, ఇల్లెందు మున్సిపాల్టీ

ప్రతి వార్డులో ఏర్పాటు చేయాలి



పట్టణంలోని ప్రతి పాఠశాలలో క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలి. క్రీడా ప్రాంగణాలు ఉంటే క్రీడాకారులు ముఖ్యంగా విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రీడల మీద దృష్టి పెడతారు. భవిష్యత్‌లో ఏదో ఒక రంగాన్ని క్రీడలలో ఎంచుకుని జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది.

– బయ్యా అభిమన్యు, ఇల్లెందు

రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న మందా నర్సింహారావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి రెండు సంవత్సరాలే ఉండాలని సీపీఎంతో సహా 11 కార్మిక సంఘాలు ప్రతిపాదించగా.. టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు మాత్రం నాలుగేళ్లు ఉండాలన్నాయని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. మంగళవారం మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం హైదరాబాద్‌లో డీవైసీఎల్సీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల చర్చల్లో ఏప్రిల్ 2న ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామన్నారని తెలిపారు. అదేవిధంగా సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రతి కార్మికుడు రెండు ఓట్లు ఒకటి ఏరియాకు, మరొకటి ఓవరాల్‌గా గుర్తింపు కోసం ఓట్లు వేయాలని 11 కార్మిక సంఘాలు ప్రతిపాదించినట్లు తెలిపారు. అదేవిధంగా సింగరేణిలో 70 శాతం బొగ్గు ఉత్పత్తిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గుర్తింపు సంగం ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని ప్రతిపాదించగా.. నాలుగు సంఘాలు మాత్రం ఒకే ఓటు విధానం ఉండాలని, కాంట్రాక్ట్ కార్మికులకు విడిగా ఓటు హక్కు కల్పించాలని ప్రతిపాదించినట్లు వివరించారు. అదేవిధంగా కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేయగా.. డిప్యూటీ సీఎల్సీ శ్రీనివాస్ అంగీకరించలేదని చెప్పారు. ఏప్రిల్ 2న జరిగే చర్చల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని అదేవిధంగా 45 రోజుల ముందు తేదీని ప్రకటిస్తామని డీవైసీఎల్సీ తెలిపినట్లు పేర్కొన్నారు. 12/3 ప్రకారం ఆర్ఎల్‌సీ ఎదుట చేసుకున్న అంగీకారానికి సంబంధించిన అంశాలను అమలు చేయటం లేదని, అండర్ గ్రౌండ్‌లో పనిచేసే టెక్నికల్ సిబ్బంది వేజ్, కేటగిరీ ప్రొటెక్షన్ అమలు చేయటం లేదని ప్రశ్నించినట్లు తెలిపారు. సీపీఎం నాయకులు విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, కే.రమేష్‌బాబు, ఎస్.సమ్మయ్య పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లు తనిఖీ

చుంచుపల్లి: జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జేవీ ఎల్ శిరీష ఆదేశాల మేరకు మంగళవారం కొత్తగూడెంలోని పలు స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ డెమో ఎండీ.ఫయాజుద్దీన్ తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగా మెయింటెన్ చేయాలని, డైలీ స్కానింగ్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్లను మార్చకూడదని, అదేవిధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించవద్దని సూచించారు.

ఇంట్లో సామగ్రి దగ్ధం

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌లో మంగళవారం వంటగ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగింది. ఇంట్లో సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. ఒంటరిగా జీవనం సాగిస్తున్న వృద్ధురాలు గ్యాస్ స్టౌ వెలిగిస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆమె బయటకు పరుగుదీసింది. వృద్ధురాలి కేకలతో ఇరుగుపొరుగు అక్కడకు చేరుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే సామగ్రి పూర్తిగా కాలిపోయాయి.

రామారావుకు నివాళి

సుజాతనగర్: సుజాతనగర్‌కు చెందిన సీపీఎం నాయకుడు చింతలపూడి రామారావు(72) గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా సీపీఎం నాయకుడు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ, నాగా సీతారాములు తదితరులు నివాళి అర్పించారు.

నిబద్ధత కలిగిన నాయకుడు కొమరయ్య

టేకులపల్లి: సిద్ధాంతం కోసం కట్టుబడి, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు జక్కుల కొమరయ్య అని సీపీఐ జిల్లా నేత, మండల కార్యదర్శి గుగులోత్ రాంచందర్ నాయక్ అన్నారు. సోమవారం ఇల్లెందులో కొమరయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం టేకులపల్లి మండల సీపీఐ శాఖ ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించి నివాళి అర్పించారు. ఎజ్జు భాస్కర్, గుగులోత్ శ్రీను, అయిత శ్రీరాములు, బాణోతు వీరన్న, లక్ష్మణ్, భద్రయ్య, సోనీ, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

వెంకటమ్మ మృతి..

జూలూరుపాడు: జూలూరుపాడుకు చెందిన సీపీఐ నాయకురాలు కొండా వెంకటమ్మ మంగళవారం మృతి చెందారు. ఆమె భౌతికాయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, చింతా స్వరాజ్‌రావు, సిరిపురపు వెంకటేశ్వర్లు, గుడిమెట్ల సీతయ్య తదితరులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వానిదే బాధ్యత..

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుడు కొంగర బాబు ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న డిమాండ్ చేశారు. బాబు ఆత్మహత్యకు నిరసనగా మంగళవారం ఇల్లెందులో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లతో అన్ని పనులు చేయిస్తున్న ప్రభుత్వం వేతనాల్లో నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. సామేలు, తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి, మోహన్‌రావు, రామిశెట్టి నర్సింహారావు, తాండ్ర కిరణ్, సుమలత, రాము, మల్లయ్య పాల్గొన్నారు.

తహసీల్ ముట్టడికి తరలిరండి



మాట్లాడుతున్న ఎస్‌కే సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): ఇళ్లు లేని పేదలు, అర్హత సాధించి డ్రాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రానీ పేదలు తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి తమ దరఖాస్తులతో కదలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని 36 వార్డుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం సుమారు ఆరువేల మంది దరఖాస్తులు చేసుకుంటే అధికారులు మూడువేల మందిని అర్హులుగా తేల్చారని, వీరిలో కేవలం ఏడు వందల మందిని డ్రా పద్ధతిలో ఎంపిక చేసి మిగిలిన పేదలను నిరాశపరిచారన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడికీ గృహవసతి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉందన్నారు. ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం వంద గజాల స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి...

పట్టణంలోని మేదరబస్తీ, రైల్వే నిర్వాసితులకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో వై.శ్రీనివాస్‌రెడ్డి, మాచర్ల శ్రీనివాస్, సత్యనారాయణచారి, చింతల రాజు, సీహెచ్ నాగయ్య, రైల్వే నిర్వాసితులు పాల్గొన్నారు.

పరిశ్రమలను రక్షించుకుందాం..



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలలో పనిచేస్తున్న 32 కార్మిక సంఘాలతో ఏర్పడిన మజ్దూర్ అభియాన్ సంఘర్ష అధికారి (మాస)జాతీయ కమిటీ సమావేశం ఈనెల 15, 16 తేదీలలో వరంగల్‌లో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు సాధినేని వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఇఫ్టూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ పరిశ్రమలు, వనరులు, అడవులు, పంటభూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. దేశంలోని బ్యాంకుల నుంచి రూ.లక్షల కోట్లు దోచుకున్న దొంగలందరూ ఆర్ఎస్ఎస్, బీజేపీ అనుచరులేనని ఆరోపించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

టేకులపల్లి: బుధవారం నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రమైన టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఐదు గదుల్లో మంగళవారం నంబర్లు వేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాగునీటి సదుపాయం కల్పించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని ప్రిన్సిపాల్ కల్పన స్పష్టం చేశారు.

జూలూరుపాడు: జూలూరుపాడు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం జరిగే ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 138 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ శారద సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

పాల్వంచరూరల్: నేడు ఉదయం 9గంటలకు ప్రారంభం కానున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు పాల్వంచ మండల, పట్టణ పరిధిలోని నాలుగు కేంద్రాలను సంబంధిత అధికారులు సిద్ధం చేశారు. మొత్తం 1,348 మంది మొదటి, 1,069 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నట్లు నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంటర్ వార్షిక పరీక్షలకు సింగరేణి మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు బుధవారం 514 మంది విద్యార్థులు పరీక్ష రాయనునట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధే లక్ష్యం



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

చుంచుపల్లి: పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయటమే తన లక్ష్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం చుంచుపల్లి మండలంలోని ఎన్‌కే నగర్, విద్యానగర్ గ్రామపంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ కింద సుమారు రూ.2.15 కోట్ల నిధులతో చెపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనలతో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలే తనకు దేవుళ్లని చివరి శ్వాస వరకు వారికి సేవ చేస్తానని పేర్కొన్నారు. తన హయాంలో ఎన్నో అభివృద్ధి పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. వనమా రాఘవేందర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీఓ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, సర్పంచ్ గోవింద్, ఎంపీటీసీ బానోత్ లక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్ ఖాన్, కాసుల వెంకట్, సర్పంచులు ధనలక్ష్మి, లక్ష్మి, ఉపసర్పంచ్ లక్ష్మి, శ్రీహరి, వార్డు మెంబర్లు, బిక్కసాని నాగేశ్వరరావు, కాసాని శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, బోడ గణేష్, తిరుపతిరావు, లక్ష్మణ్ నాయక్, ఎలుక చందర్, రవి, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: క్షయ (టీబీ) వ్యాధి పట్ల అపోహలు వద్దని మందులతో తగ్గిపోతుందని, టీబీ నివారణకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నిక్షయ దివస్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కోయగూడెం, గోలియాతండా, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, బద్దు తండా పంచాయతీల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. 2025 కల్లా భారతదేశంలో టీబీ లేకుండా చేయడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యుల నిరంతర పర్యవేక్షణలో వ్యాధి పూర్తిగా తగ్గేవరకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు మందులు వాడే కాలానికి పోషకాహార నిమిత్తం నెలకు రూ.500 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం లాంటి లక్షణాలు ఉంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఇది గాలి ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి సంక్రమించే అంటు వ్యాధి కాబట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్పంచ్‌లు పూనెం ఉమ, బోడ నిరోషా, మాలోతు సురేందర్, భూక్యా చిన్ని, పల్లె దవాఖాన వైద్యాధికారులు ఇంద్రజ, హారిక, నందు, ధరణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

17నుంచి సీపీఎం జనచైతన్య యాత్ర



మాట్లాడుతున్న ఐలయ్య

జూలూరుపాడు: ఈనెల 17న హనుమకొండలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ నాయకత్వంలో ప్రారంభమయ్యే జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు కాసాని ఐలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం జూలూరుపాడులో పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జన చైతన్య యాత్రను పార్టీ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర 21వ తేదీ రాత్రి జూలూరుపాడు మండల కేంద్రానికి చేరుకుంటుందన్నారు. ఆ యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సీతారాములు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. యాత్రలో సీపీఎం కార్యకర్తలు, నాయకులు, కార్మికులు, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడానికే సీపీఎం జన చైతన్య యాత్రను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మండల కార్యదర్శి యాసా నరేష్, చీమలపాటి భిక్షం, గార్లపాటి వెంకటి, గడిదేసి కనకరత్నం, ఊడల వెంకటేశ్వర్లు, ఇస్లావత్ భద్రు, వి.చందర్‌రావు, పి.సుగుణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్ జీవితం పేదల ప్రజలకు అంకితం

సింగరేణి(కొత్తగూడెం): పేదల ప్రజల జీవన ప్రమాణాలకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కారల్‌మార్క్స్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కారల్‌మార్క్స్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కారల్‌మార్క్స్ తన జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేశారని, తన కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి ప్రజలే దైవంగా ఉద్యమాలు చేసి, ప్రజలకు అనేక హక్కులు సాధించారని కొనియాడారు. ఆయన గొప్ప మానవతావాది అని, దోపిడీకి గురవుతున్న కార్మికుల తోపాటు దోపిడీ చేస్తున్న పెట్టుబడిదారులు పరాయీకరణ చెందాలని మార్క్స్ అంచనా వేసినట్లు చెప్పారు. అయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మందా నర్సింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, డి.వీరన్న, విజయగిరి శ్రీనివాస్, సమ్మయ్య, వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓబీసీలపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష



మాట్లాడుతున్న ఆకుల నాగేశ్వరరావు

చుంచుపల్లి: ఓబీసీలకు ప్రాధాన్యం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ అన్నారు. బీజేపీ కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు అందించడం లేదన్నారు. ఓబీసీలకు కార్పొరేషన్ నిధులను తొమ్మిది సంవత్సరాలుగా ఒక్కరూపాయి కూడా ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో రాయుడు నాగేశ్వరరావు, రమేష్, బి.రవీందర్, శ్రీనివాసకుమార్, రవీందర్, కృష్ణ, కేశవ్, మిద్యే రాఘవ, రవిగౌడ్, నాగేంద్రప్రసాద్, బాల నర్సింహులు, నరేంద్రబాబు, నిర్మలాదేవి, గుమలాపురం సత్యనారాయణ, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా కిన్నెరసాని నీటి కాలువ

వేసవికాలం.. పర్యాటకులు, స్కూళ్లకు సెలవులు కావడంతో విద్యార్థులు కిన్నెరసానికి విహార యాత్రకు వచ్చిపోతుంటారు. 24 గంటలూ వేగంగా ప్రవహించే కిన్నెరసాని కాలువ కు ఎలాంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. డీర్ పార్క్ ఎదుట కేటీపీఎస్ కర్మాగారానికి నీటి సరఫరా జరిగే కెనాల్‌లోకి పర్యాటకులు దిగి సరదాగా ఈత కొడుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. కాలువలోకి దిగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని పలుమార్లు కేటీపీఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.

- పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : సురేష్, కేటీపీఎస్ ఏఈ
సెల్ నంబర్ : 9010661030